
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శనివారం 12 ఏప్రిల్ 2025



నేడు వీర హనుమాన్ విజయయాత్ర

కరీంనగర్ కల్చరల్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి వైశ్య భవన్ వద్ద గల రామాలయం నుంచి విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్ర పేరుతో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంస్థల బాధ్యులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంసింగ్‌తో పాటు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇనుగంటి మధుసూదన్‌రావు, ఆదిమూలం విద్యాసాగర్, గో రక్షా రాష్ట్ర కమిటీ మెంబర్ వుట్కూరి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొంటారు.

పూలే ఆశయాలను కొనసాగించాలి

- జయంతి సభలో నేతలు



పూలేకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్,ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతిప్రతినిధి): సామాజిక రుగ్మతలను రూపుమాపి బహుజనుల అభివృద్ధికి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి శాతవాహన యూనివర్సిటీ చౌరస్తా గల పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ సహా పలువురు బీసీ సంఘాల నేతలు, అధికారులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే వంటి సంఘసంస్కర్తల కృషివల్లే నేటి సమాజం చైతన్యవంతంగా ఉందని అన్నారు. శాతవాహన యూనివర్సిటీ ముందు గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చౌరస్తాను అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ బహుజనులకు చదువే అభివృద్ధి మార్గమని సూచించి ఆనాటి రోజుల్లో మహిళా చదువును ప్రోత్సహించిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మజ్యోతిరావు పూలే అని అన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించడంతో పాటు మహిళా పాఠశాలలను స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఆనాటి కాలంలో ప్రజలను చైతన్యం చేయడంలో పూలే కీలక పాత్ర పోషించారని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, వర్ణ, లింగ భేదాలను రూపుమాపి అభివృద్ధికి చదివే మూలమని చాటి చెప్పిన మహనీయుడు పూలే అని అన్నారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబాపూలే రాసిన పుస్తకాన్ని, తెలుగు, ఇంగ్లీష్ అనువాద పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, బీసీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- నేడు చొప్పదండి నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభం
- 342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- 5.86 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ధాన్యం కొనుగోళ్లకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. యాసంగిలో 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 342 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం చొప్పదండి నియోజకవర్గంలో లాంచనంగా కొనుగోళ్లకు శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో ప్రతి గ్రామంలోనూ, పెద్ద గ్రామాల్లో అవసరమైతే రెండేసి కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 180, ఐకేపీ ఆధ్వర్యంలో 120, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 38, హాకా ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం కోతలు పూర్తవుతుండడంతో రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 342 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ కొనుగోలు కేంద్రాలలో సన్న,దొడ్డు రకం వరి విత్తనాలను కొనుగోలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

యాసంగిలో 2,66,896 ఎకరాల్లో వరిసాగు

జిల్లాలో యాసంగిలో 2,66,896 ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఇందులో 1,99,051 ఎకరాల్లో దొడ్డు రకాలు, 67,845 ఎకరాల్లో సన్న రకం సాగుచేశారు. వీటిలో సుమారు 40వేల ఎకరాల్లో విత్తనపంట ప్రధానంగా హుజురాబాద్ రెవెన్యూ డివిజన్‌లో సాగైంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఈసారి 5,86,723 మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దిగుబడిలో 4,57,817 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1,28,906 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం వస్తుందని అంచనా వేశారు. రైతుల స్వంత అవసరాలు, సీడ్ దిగుబడి కింద 2,26,713 మెట్రిక్ టన్నులు మినహాయిస్తే 3,60,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావించి ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు 2,74,946 మెట్రిక్ టన్నుల దొడ్డు వరి ధాన్యం, 85,054 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం వేసేందుకు యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లను అవసరమైన మేరకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. 7,472 టార్పాలిన్ల అవసరం కాగా 4,955 ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. మిగతా వాటిని తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్యాడీ క్లీనర్లకు మరో 15 ప్యాడీ క్లీనర్లను కొనుగోలు చేసి తెప్పిస్తున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. సన్న ధాన్యం గుర్తించేందుకు ప్రతి నాలుగైదు కేంద్రా లకు ఒక వ్యవసాయాధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆ అధికారి గ్రెయిన్ కాలిపర్‌తో వరి ధాన్యాన్ని కొలిచి సన్న రకంను నిర్ధారిస్తారు. వరి గింజ 6 మి.మీ. పొడవు, 2 మి.మీ. వెడల్పు ఉంటేనే సన్నరకంగా గుర్తిస్తారు. గతంలో జిల్లాలో 336 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈసారి అదనంగా మరో 6 కేంద్రాలతో మొత్తం 342 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెబుతున్నారు. అంతే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైసుమిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళలకు ఈ- ఆటో డ్రైవింగ్ శిక్షణ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో మహిళల స్వయం ఉపాధి కోసం ఈ-ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ కార్య క్రమాన్ని శనివారం 12వ తేదీ నుంచి ప్రారంభిం చను న్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం శిక్షణకు సంబంధించిన ప్రణాళికపై జిల్లా కలెక్టర్ అధి కారులతో చర్చించారు. మోవో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు 60 రోజుల పాటు ఈ-ఆటో డ్రైవంగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన మహిళా ఇన్‌స్ట్రక్టర్లతో శిక్షణ ఇప్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శిక్షణ అనంతరం వారికి డ్రైవింగ్ లైసెన్స్ అందజేయాలని సూచించారు. శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధి పొందేలా ఆటో కొనుగోలు చేసుకునేందుకు రుణం పొందే మార్గాలను, ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి సూచించాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సబిత, అడిషనల్ డిఆర్‌డిఓ సునీత, మెప్మా పీడీ వేణుమాధవ్, మహిళ ప్రాంగణం మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ వేడుకలకు భారీ ఏర్పాట్లు

- ఉమ్మడి జిల్లా నుంచి 1.50 లక్షల జన సమీకరణ
- నేడు కరీంనగర్, సిరిసిల్ల జిల్లా ముఖ్యకార్యకర్తలతో కేటీఆర్ సమావేశం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సంద ర్భంగా వరంగల్ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహిం చతల పెట్టిన పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పండుగ వాతావ రణం లో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేప ట్టినట్లు మాజీ మంత్రి, కరీం నగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చెప్పా రు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోట ల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు ఇష్టమైన జిల్లా కరీంనగర్ అని ఇక్కడ నుంచి ప్రారంభించిన ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని భావిస్తారని అన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి లక్షా 50వేలకు తగ్గకుండా సభకు తీసుకు వెళ్లేందుకు రవాణా సౌకర్యంతో పాటు అవ సరమైన అన్ని చర్యలను తీసుకున్నా మన్నా రు. 400 ఆర్టీసీ బస్సులను, అందుబాటులో ఉన్న 90 ప్రైవేట్ బస్సు సర్వీసులను, జిల్లా లోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను కూడా తీసెకెళ్లనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం కరీంనగర్, సిరిసిల్ల ముఖ్యనాయకులతో చింత కుంటలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాల యంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథా లయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కు మార్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, అక్బర్ హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, మాజీ సుడా డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్థానికులకు అన్యాయం.. బినామీలకు అవకాశం

- మున్సిపల్ దుకాణాల కేటాయింపుపై విమర్శలు
- అర్హులైన స్థానిక వీధివ్యాపారులకు న్యాయం చేయాలని డిమాండ్



సివిల్ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన మున్సిపల్ వాణిజ్య సముదాయం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా స్థానిక సివిల్ హాస్పిటల్ ప్రాంతంలో నిర్మించిన 126 దుకాణాలతో కూడిన మున్సిపల్ వాణిజ్య సముదా యంలో దుకాణాల కేటాయింపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి అక్కడే రోడ్డుపై చిరువ్యాపారాలు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న చాలా మంది వీధివ్యాపా రులకు మున్సిపల్ దుకాణాలు లభించలేదు. ప్రభుత్వ ఆసుపత్రికి నలువైపులా అనేక మంది చిరు వీధివ్యాపారులు టీకొట్టు, దుకాణాలు, పండ్లు, బ్రెడ్స్, ఇతర దుకాణాలను నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తరచూ రోడ్డుపక్కన ఉన్న దుకాణాలను తొలగించడంతో సంవత్సరాలుగా ఇబ్బందిపడ్డారు. చివరకు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణంతో ఇబ్బందులు తప్పుతాయని, శాశ్వతంగా దుకాణాలను తక్కువ అద్దెతో కేటాయిస్తే ఇక వ్యాపా రం చేసుకొని జీవించవచ్చని ఆశలు పెట్టుకున్నారు. మున్సిపల్ దుకాణాల కేటాయింపులో తమకు ప్రాధాన్యత ఇచ్చి మిగిలిన వాటిని ఇతరులకు కేటాయించాలంటూ దుకాణాల నిర్మాణం నుంచి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు. దుకాణాల కేటాయింపు కోసం డ్రా నిర్వహిస్తామని మున్సిపల్ అధికారులు సూచించడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు 75 దుకాణాలను స్థానిక చిరు, వీధివ్యా పారులకు కేటాయించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం స్ట్రీట్ వెండర్స్ కమిటీని ఏర్పాటు చేసి స్థానిక అర్హులైన పేద వ్యాపారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. 39 దుకాణాలకు అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి దుకాణాలను కేటాయించారు. మిగిలిన 36 దుకాణాలకు అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉండగా 13 మంది మంది వీధివ్యాపారులను ఎంపిక చేసి 23 దుకాణాలకు లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. వీరిలో ఎక్కువగా దళిత వ్యాపా రులకే అన్యాయం జరుగడంతో వారు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు డ్రా పద్ధతిలో దుకాణాలను చేజిక్కించుకున్న వ్యాపారులు బినామీగా ఉంటూ మున్సిపల్‌కు నామి నల్ అద్దె చెల్లిస్తూ ఒక్కో దుకాణాన్ని 10వేలకుపైగా అద్దెకిచ్చి లబ్ధిపొందుతున్నారు. వీధి వ్యాపారాలపైనే జీవనం గడిపే వారికి అన్యాయం చేశారని, జిల్లా కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్ పాయ్ దృష్టిసారించి అర్హులైన వారికి దుకాణాలు కేటాయించాలని, బినామీ పేర్లతో దుకాణాలు నడుపుతున్న వారి కేటాయింపులను రద్దు చేయాలని మాజీ కార్పొరేటర్ సరిళ్ళ ప్రసాద్‌తోపాటు పలువురు చిరు వ్యాపారులు కోరుతున్నారు.

అశ్వవాహనంపై రాములోరు



ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సీతారాములను అశ్వవాహనంపై ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఊరేగించారు. హనుమాన్ భక్తులు రామనామస్మరణ చేస్తూ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ఈవో కందుల సుధాకర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

\- ఇల్లందకుంట

'ఉపాధి'కి భరోసా.. వేతనం రాక నిరాశ

- రెండు నెలలుగా అందని వేతనాలు
- జాబ్‌కార్డులున్నా పనులకు వెళ్లేది కొందరే



పోరండ్లలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాలలోని ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 2005లో ప్రవేశపెట్టింది. దీంతో గ్రామాల్లోని కూలీలందరికీ పనులు దొరకడంతో ఆర్థికంగా తోడ్పాటు అందుతోంది. తిమ్మాపూర్ మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం జాబ్ కార్డుల సంఖ్య 7,766 అందులో 13,677 కూలీలు నమోదయ్యారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఉపాధి హామీ పనులకు 2,150 మంది వెళ్తే ఈ సంవత్సరం 1,150 మంది కూలీలు మాత్రమే పనులకు వెళ్తున్నారు. వ్యవసాయ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో కూలీలు సంఖ్య పెరగడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం కమ్యూ నిటీ వాటర్ హార్వెస్టింగ్ పాండు, వ్యవసాయ పొలాలకు రోడ్ల నిర్మాణం, కొత్త కుంటల నిర్మాణం, ఫీడరు కాలువలో పూడిక తీయడం పనులు చేపడుతున్నారు.

ఏప్రిల్ నుంచి రూ. 307కు పెరిగిన కూలి

రెండు నెలలుగా వేతనాలు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ యేడు ఏప్రిల్ 1 నుంచి ఉపాధి హామీ కూలీలకు 300 నుంచి 307 రూపాయలకు వేతనం పెంచింది. అయితే 2005 ఉపాధి హామీ పథకం ప్రారంభించినప్పుడు రోజువారి కూలి 87.50 ఉండగా అప్పటి నుంచి ఏడాదికి 10 నుంచి 30 రూపాయల వరకు పెంచుతూ వచ్చారు. ఈ ఏడాది కేవలం 7 రూపాయలను మాత్రమే పెంచడంపై కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా నిలిచిన వేసవి భత్యం

గతంలో వేసవి భత్యం 15-30 శాతం వరకు అదనంగా చెల్లించేవారు. 2022 ఏప్రిల్ నుంచి పూర్తిగా తొలగించారు. వీటితో పాటు పార, గడ్డపార, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం కూడా ఉండేది. వేసవి భత్యంతో పాటు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన మహిళ

చందుర్తి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సైబర నేరస్థుల చేతిలో ఓ మహిళ మోసపోయిన సంఘటన చందుర్తి మండలం సనుగులలో ఈనెల 9న జరుగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. లక్ష్మి అనే మహిళ కుమారుడు మనోజ్ ఆరుమాసాల క్రితం దుబాయ్ వెళ్లాడు. ఈనెల 9న గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్‌చేసి మీ కుమారుడి ప్రాణం బాగాలేదని, ఆసుపత్రికి తీసుకువచ్చామని, ఈ ఫోన్ నంబర్‌కు రూ.5వేలు పంపించాలని చెప్పగా ఆమె డబ్బులు పంపించింది. కొంత సమయం తర్వాత ఆమె కొడుకుకు ఫోన్‌చేసి ఆరోగ్యం ఎలా ఉందని ఆరాతీసి జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి ఆమె చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

కల్వలలో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు

- 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

శంకరపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కల్వల గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడిచేసి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని కల్వల గ్రామంలో దాడులు చేసి శివరాత్రి మల్లయ్య అనేవ్యక్తి వద్ద 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 200లీటర్ల బెల్లం పానకం, తయారీ సామాగ్రిని ధ్వంసం చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్, కమలాకర్, సంతోష్, సాయి, కాసిండి, కమలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాణిస్తున్న క్రీడాకారులు

- సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ
- ఐదేళ్ల పాటు సెంటర్ కొనసాగింపు
- కోచ్ ద్వారా రోజూ శిక్షణ


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థిని విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా సెంటర్‌ను మంజూరు చేశారు. ఖోఖో క్రీడలో శిక్షణ ఇవ్వడానికి ఈ సెంటర్ మంజూరు చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తూ పలు పతకాలు సాధిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ సెంటర్‌ను ప్రారంభించారు. మొదట సెంటర్ మార్కండయ కాలనీలోని పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న మినీ స్టేడియంలో నిర్వహించారు. అయితే అక్కడ సౌకర్యాలు లేకపోవడం, తగిన భద్రత కరువవడంతో ఈ కేంద్రాన్ని ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మార్చారు. క్రీడలలో ఆసక్తి ఉన్న వారు ఈ కేంద్రానికి వచ్చి శిక్షణ పొందుతున్నారు. పలువురు విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో పాల్గొంటూ ఖేలో ఇండియా సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారు. రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు శిక్షణ కొనసాగుతుంది. అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు, బంగారు పతాక గ్రహీత గెల్లు మధూకర్‌ను కోచ్‌గా నియమించి ఖోఖోలో శిక్షణ ఇస్తున్నారు.

పలు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో....

ఖోఖోలో శిక్షణ పొందిన క్రీడాకారులు పలువురు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పలు పతకాలు సాధించారు. జి వైష్ణవి అనే విద్యార్థిని కేరళలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పతకం సాధించింది. అలాగే సీఎం కప్ పోటీలు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో కూకట్ల అఖిల్, నాంపల్లి సిద్దార్థ, శ్రీగిరి అభిరనందన్, గొట్టం చరణ్ అజయ్, మనోజ్ మహాలక్ష్మి శృతి తదితరులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో మరో ఇరవై మంది ఆడారు. మహాలక్ష్మి, శ్రీగిరి అభిర నందన్ సీఎం కప్ పోటీలలో బహుమతులు సాధించారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వైష్ణవి


జాగింగ్ చేస్తున్న క్రీడాకారులు

రోజూ 60 నుంచి 70 మందికి శిక్షణ

గెల్లు మధూకర్, ఖేలో ఇండియా సెంటర్ కోచ్



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా సెంటర్ ద్వారా రోజు 60 నుంచి 70 మంది బాల బాలికలకు ఖోఖో లో శిక్షణ ఇస్తున్నాం. ఖోఖో ద్వారా నేను అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధించాను. పిల్లలకు కూడా తగిన తర్ఫీదు ఇస్తూ వారిని కూడా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తాను.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలి

- సురేష్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి



గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సుల్తానాబాద్ లో ఖేలో ఇండియా సెంటర్‌ను మంజూరు చేసింది. ఇందులో ఆసక్తి ఉన్న క్రీడాకారులకు ఖోఖోలో శిక్షణ ఇస్తాం. ప్రతీ జిల్లాకు ఒక సెంటర్ మంజూరు కాగా పెద్దపల్లికి ఖోఖో సెంటర్ మంజూరైంది. ఈ సెంటర్‌ను సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేశాం. ఇది ఐదేళ్ల పాటు కొనసాగుతుంది. ఇందులో శిక్షణ పొందిన పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించి బంగారు పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నాం.

సెంటర్ ఏర్పాటుతో ఖోఖోకు పూర్వ వైభవం

పారుపల్లి వెంకట ఉమాపతి, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి



సుల్తానాబాద్ లో స్పోర్ట్స్ అథారిటీ వారు ఖేలో ఇండియా సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఖోఖో క్రీడకు పూర్వ వైభవం చేకూరింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఖోఖో క్రీడకు సుల్తానాబాద్ నిలయంగా ఉండేది. సెంటర్‌ను సుల్తానాబాద్ లో ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత క్రీడాకారులకు ఎంతో వెసలుబాటుగా ఉంటుంది. వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ ఈ సెంటర్ ద్వారా వెలుగులోకి వచ్చి జాతీయ అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశాలు వస్తాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హత్యచేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదుతోపాటు ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాలోని మెట్‌పెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెపేటకు చెందిన షేక్‌అహ్మద్ మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2023 ఫిబ్రవరి18వ తేదీన పనికి వెళ్లకుండా స్నేహితులతో కలిసి అహ్మద్ మద్యం సేవించాడు. మద్యం మత్తులో చెట్‌పెల్లి సురేష్ అనే వ్యక్తికి అహ్మద్‌కు మధ్య సిమ్ కార్డు విషయంలో గొడవ జరిగింది. దీంతో సురేష్ తన జేబులో ఉన్న నేల్‌కట్టర్‌తో అహ్మద్ కడుపులో పొడిచాడు. తీవ్ర గాయాలైన అహ్మాద్‌ను కుటుంబసభ్యులు మెట్‌పెల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ అహ్మాద్‌మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్యాంరాజ్ కేసు నమోదు చేయగా సీఐ లక్ష్మీనారాయణ కేసుదర్యాప్తు చేసి నిందితుడైన రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టుడ్యూటీ అధికారులు రంజిత్, కిరణ్ కుమార్ సరైనసాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సురేష్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

పుస్తెల తాడు చోరీ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గురువారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మొగిలి రాజవ్వ(70) మెడలోని రెండు తులాల పుస్తెల తాడును ఓ ఆగంతకుడు ఎత్తుకెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఎంజేపీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జాయింట్ సెక్రెటరీ


కళాశాల సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్యాం ప్రసాద్‌లాల్

తిమ్మాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్ లాల్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల గురుకులంతోపాటు ఇంటర్ కళాశాల, వ్యవసాయకళాశాల విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. మెనూప్రకారం భోజనం పెడుతున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వస్తువుల నాణ్యత, కిచెన్‌ను తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎవరికి భయపడవద్దని విద్యార్థినులకు అభయం ఇచ్చారు. ఆర్సీవో అంజలి, ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కట్నం కోసం వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం కట్టుకున్న ఇల్లాలును వేధించిన కేసులో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల గ్రామానికి చెందిన భర్త పడగ తిరుపతికి యేడాది పాటు జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానాను విధిస్తూ సిరిసిల్ల అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సృజన తీర్పు చెప్పారని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని అడిగె మాధవికి చిన్నబోనాల గ్రామానికి చెందిన పడగ తిరుపతితో 2007లో వివాహమైంది. ఆ సమయంలో మాధవి పుట్టింటి వారు రూ. 4లక్షల నగదుతో పాటు 5 తులాల బంగారు,30 తులాల వెండి ఆభరణాలు ఇతర లాంచనాలతో పెళ్లి జరిపించారు. ఐదేళ్ల పాటు అన్యున్యంగా దంపతులు కలిపి జీవించారు. అనంతరం భర్త తిరుపతి తన తల్లిదండ్రుల ప్రోద్బలంతో అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ క్రమంలో భరించలేక మాధవి తన పుట్టింటికి చేరుకుంది. మొదటి భార్య ఉండగానే తిరుపతి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడని పేర్కొంటూ భర్త, అతని కుటుంబ సభ్యులపై మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి ఎస్ఐ నరేశ్ న్యాయస్థానంలో చార్జీషీటు దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీందర్‌నాయుడు, ఆర్ఎస్ఐ శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శంకర్‌లు సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సతీష్‌కుమార్ వాదించారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి సృజన నిందితుడు తిరుపతికి యేడాది పాటు జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అజయ్ (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వరదకాలువ శివారులో పల్లికొండ అజయ్(20) అనే యువకుడు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కథలాపూర్ నుంచి భూషణరావుపేటకు ద్విచక్రవాహనంపై అజయ్‌వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనం కొంతదూరం పడి ఉండడంతో ఎవరైనా ఎదురుగా వచ్చి అజయ్‌ను ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అజయ్ కోరుట్లలో ఓప్రైవేట్‌కళాశాలలో డిగ్రీసెకండ్ ఇయర్ చదువుతున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ఎలిగేడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో యువకుడిని అరెస్ట్ చేసినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. అదేగ్రామానికి చెందిన తీట్లనవదీప్(22) అత్యాచారయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో అత్యాచారయత్నం చేశాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఫోక్సోచట్టం కింద కేసునమోదు చేశామన్నారు. శుక్రవారం నిందితుడిని సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పొడపత్రపు హరీష్(32) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మార్చి 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

మంథనిరూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలపై మంథని పోలీసుస్టేషన్‌లో శని వారం ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసునమోదైంది. గోపాల్ పూర్‌లో వీవోఏగా పనిచేస్తున్న గొరిగె జయసుధను విధుల నుంచి తొలగించిన విషయంలో పీడీ ఆదేశాల మేరకుగ్రామంలో విచారణ జరిగింది. ఆ సమయంలో ఆమెను, అదే గ్రామానికి చెందిన ఎరుకల సమ్మక్కను వీవో అధ్యక్షురాలు లక్కసరిత, దాసరిబుజమ్మ, దాసరి రమాదేవీలు కులంపేరుతో దూషించినట్లు బాధితు రాలు జయసుధ మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగాముగ్గురిపై అట్రాసిటీ కేసునమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విదేశాలలో ఉద్యోగంపేరుతో యువకుడిని మోసం చేసిన వ్యక్తిపై కరీంనగర్ రెండో ఠాణాలో పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి వివరాల ప్రకారం... కరీంనగర్ భగత్‌నగర్‌కు చెందిన కె.మెహర్‌తేజ విదేశాల్లో ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాడు. అతడి స్నేహితుడి ద్వారా కిరణ్ అనే వ్యక్తిని పరిచయమయ్యాడు. బ్యాంకాక్‌లో ఉద్యోగం కోసం కిరణ్‌కు రూ.30 వేలు ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. అనంతరం బ్యాంకాక్ చేరుకున్న మెహర్‌తేజనుంచి కంపెనీవారు పాస్‌పోర్ట్ తీసుకొని క్రిప్టోకరెన్సీలో ఉద్యోగం ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ప్రజలను మోసం చేయడం నచ్చని మెహర్‌తేజ అక్కడి భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి ఇండియాకు వచ్చాడు. రావడంతోనే హైదరాబాద్‌లోని సైబర్ క్రైం విభాగాన్ని ఆశ్రయించాడు.

ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు

- మైలారంలో విద్యార్థులు, గ్రామస్థుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు

గన్నేరువరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతోపాటు విద్యాబుద్దులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విచక్షణ మరిచి బాధ్యతారాహిత్యంగా చితకబాదుతున్నాడని, పాఠశాల హెచ్‌ఎంతోపాటు పాఠశాల సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని పాఠశాలనుంచి పంపించేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు పాఠశాల ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మైలారంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాంరాజయ్య పాఠాలు చెప్పకుండా తరగతి గదిలో నిద్రపోతుంటా రని, విద్యార్థులను విచక్షణారహితంగా చితకబాదుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సిబ్బందిని, అటెండర్‌ను ప్రధానోపాధ్యాయుడిని సైతం బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాంరాజయ్య మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలోని సమస్యలపై ప్రశ్నించినందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేసి తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు.

ఇంజనీర్లు జ్ఞాన సమాజాన్ని నిర్మించాలి


మాట్లాడుతున్న ఎస్‌యూ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూరెపల్లి సుజాత

కొడిమ్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు గౌరవం కలిగిన జ్ఞాన సమాజాన్ని నిర్మించాలని శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సూరెపల్లి సుజాత అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజాత మాట్లాడుతూ ఇంజనీర్లలో సృజనాత్మకత ఉండాలన్నారు. విద్యతో సంపాదించుకున్న జ్ఞానంతో విజయాలను సాధించి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. అంతకుముందు జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ప్రభాకర్ కళాశాల వార్షిక ప్రగతినివేదిక చదివివినిపించారు. అనంతరం విద్యార్థులుచేసిన నృత్యాలుఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానంగా రాములోరి రథోత్సవం

- ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం రాములోరి రథోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆరు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం ముందుగా హోమం కార్యక్రమం నిర్వహించి సీతారామచంద్రస్వాముల ఉత్సవవిగ్రహాలను అందంగా అలంకరించిన రథంపై ఉంచి ఆలయం చుట్టూ జైశ్రీరాం నినాదాలతో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు వేడుకలను నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయకమిటీచైర్మన్ బండివెంకన్న, ప్రధాన కార్యదర్శిమంత్రి హరగోపాల్, సింగిల్‌విండోఛైర్మన్ మంత్రి వేణుగోపాల్, మైత్రిగ్రూప్ ఛైర్మన్ కొత్తజైపాల్‌రెడ్డి, మండలనాయకులు రాములుగౌడ్, అమిరిశెట్టి మల్లారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, లక్ష్మీరాజం, మల్లేశం, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు కాదు.. కర్కోటకులు

- ముత్తారంలో తల్లిపై అత్యాచారయత్నం
- ప్రతిగా రోకలిబండతో దాడి.. కొడుకు మృతి
- ఎల్లారెడ్డిపేటలో తండ్రిని హతమార్చిన కొడుకు

కుటుంబ బంధాలు మసకబారుతున్నాయి. కన్న కొడుకులు కర్కోటకులుగా మారారు. క్షణికావేశంలో ఏం చేస్తున్నామో తెలియని పరిస్థితుల్లో అకృత్యాలకు పాల్పడ్డారు. మద్యం మత్తులో ఓ కొడుకు తల్లిపై అత్యాచారయత్నానికి పాల్పడగా ప్రతిఘటించి దాడి చేయడంతో మృతి చెందాడు. ఏ పని చేయకుండా తిరగవద్దని మందలించిన కన్నతండ్రినే కడతేర్చాడు ఓ కొడుకు.

ముత్తారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సభ్యసమాజం తలదించుకునేలా మద్యం మత్తులో కుమారుడు తల్లిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆమె ప్రతిఘటించి దగ్గరలోనే ఉన్న రోకలిబండతో దాడి చేయగా తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గురువారం రాత్రి జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలానికి చెందిన యువకుడు (33) కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో అతడి భార్య విడాకులు తీసుకొంది. అప్పటి నుంచి అతిగా మద్యం సేవిస్తున్నాడు. మద్యానికి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. పడుకొని ఉన్న తల్లి వద్దకు వెళ్లి అత్యాచారయత్నం చేశాడు.. ఖంగుతిన్న ఆమె కొడుకును నెట్టివేసి దగ్గరలో ఉన్న రోకలి బండతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి.

అనంతరం తండ్రితోపాటు స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు.


కొడుకు చేతిలో హతమైన కనకయ్య

ఎల్లారెడ్డిపేట : పని చేయకుండా తిరగవద్దని మందలించిన కన్నతండ్రినే కడతేర్చాడు ఆ కొడుకు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని కుంచెం కనకయ్య(50) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒక్కాగానొక్క కొడుకు పర్శరాములు ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో తండ్రి కనకయ్య కొడుకును మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన కొడుకు పర్శరాములు కర్రతో తండ్రిపై దాడి చేశాడు. దాంతో కనకయ్య స్పృహ తప్పి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు 108లో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కొడుకు పర్శరాములు పరారీలో ఉన్నాడు. మృతుడికి భార్య దేవవ్వ, ఇద్దరు కూతుళ్లు సుమలత, మౌనికలు ఉన్నారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చురుగ్గా కొనసాగుతున్న మల్కపేట కాలువ మరమ్మతు పనులు

- కుడి కాలువ ద్వారా నీటి విడుదలకు ఏర్పాట్లు



పల్లిమక్త- సుద్దాల గ్రామాల మధ్య వేస్తున్న పైప్‌లైన్

కోనరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట కాళేశ్వరం ప్రాజెక్టుప్యాకేజీ9లో మల్కపేట నుంచి మారుపాక గ్రామంవరకు గల మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ మరమ్మతు పనులు రాష్ట్రప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ ఆదేశాల మేరకు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుత నీటి కరువును దృష్టిలో ఉంచుకొని సాగు, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా కుడికాలువ లోకి నీటినివిడుదల చేయడానికి అధికారులు పనులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రామన్నపేట, సుద్దాల మధ్యలోగల బ్రిడ్జిల కింద మట్టిని తొలగించి మధ్యలో కాలువపై పైపులువేశారు. నాగారం, పల్లిమక్తగ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై పైపులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తూ, కాలువలో వివిధచోట్ల చేరిన పూడిక తొలగిస్తున్నారు.

క్రీడల్లో సత్తాచాటిన గురుకుల కళాశాల విద్యార్థినులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):శాతవాహన యనివర్సిటీపరిధిలో సౌత్ జోన్ స్పోర్ట్స్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీకసంక్షేమగురుకులకళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఖోఖోపోటీల్లో నికిత, సింధు,సుష్మ,అశ్రిత,హిమజరెండో స్థానంలో నిలిచారు. సౌత్‌జోన్‌పోటీల్లో అలగప్ప యునివర్సిటీ తమిళనాడులో నిర్వహించిన కబడ్డీలోఇస్రా,సుష్మిత,జెప్పిరావు యూనివర్సిటీ చెన్నైలో నిర్వహించిన వాలీబాల్‌లో కావ్య శ్రీ, గీతం యూనివర్సిటీ నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో చాందిని, శివాని, కె నందిని ప్రతిభ కనబరిచారు. కరీంనగర్ అసోసియేషన్అథ్లెటిక్‌స్టేట్‌విభాగంలో హైదరాబాద్‌లో అక్షర, కరీంనగర్ అసోసియేషన్ ఫుట్‌బాల్ స్టేట్‌విభాగం నిజామాబాద్‌లో శ్రీహర్షిని, నవదిత, తేజస్వి, రచన, పుష్పలత, ఇష్రా, కావ్య, అంజలి, రాజమణి, నికిత, సత్య, శ్రీజ, కరీంనగర్ అసోసియేషన్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయిపోటీల్లో రాజమణి పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాలఆవరణలో ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్‌సమత అభినందించారు.



'పండంటి' ఆరోగ్యం



- ఎండ వేడికి పండ్లతో చెక్
- పొంచి ఉన్న విషంపై జాగ్రత్త
- రసాయనాల కారణంగా దీర్ఘకాలంలో ప్రమాదం
- వేసవిలో హాయినిచ్చే పండ్లలో ఉపయోగాలు ఎన్నో

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సూర్యుడు సుర్రుమంటున్నాడు.. వేడి, ఉక్కపోతలతో ప్రజలు అబ్బో ఎండలు అంటూ గడప దాటడానికి భయపడుతున్నారు. ఎండ తీవ్రతతో వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతారు. వీటికి పండ్లు ఉపశమనాన్ని ఇస్తాయి. శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా సమతుల్యం చేయడానికి పండ్లు ఎంతో ఉపయోగపడుతాయి. వేసవిలో ఎక్కువగా నీరు చెమట రూపంలో వెళుతుంది. దీని వల్ల లవణాలు కోల్పోయి నీరసపడుతాం. ఈ పరిస్థితుల్లో ఎక్కువగా పండ్లు తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెపుతున్నారు. వేడినుంచి ఉపశమనంగా ఆరోగ్యానిచ్చేవి పండ్లు. ఆపిల్ తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదంటారు. జీర్ణశక్తికి అరటి ఉపయోగపడితే గ్యాస్ సమస్యకు బొప్పాయి ఉపయోగపడుతుంది. చల్లదనంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు ఇచ్చే పండ్లలోకి విషం చేరుతోంది. నగరాల్లో పండ్లవ్యాపారం వేసవిలో ఎక్కువగా ఉంటుంది. కానీ వ్యాపారులు రసాయనాలను పండ్లపై చిమ్మి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేస్తున్నా ఆగడం లేదు.

● రసాయనాలు ఎందుకు..?

పండ్లపై రసాయనాలను స్ప్రే చేయడం వల్ల వేగంగా పండుతాయి. ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ప్రధానంగా మామిడి, ఆపిల్, అరటి, సపోట, దానిమ్మ, జామ, బొప్పాయి, ఆరెంజ్‌లపై వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాల్షియం కార్బైడ్.. ఇది పౌడర్ రూ పంలో ఉంటుంది. పౌడర్ ప్యాకెట్లను పండ్ల మధ్యలో పెట్టి దానిపై టార్పాలిన్ కప్పి నీళ్లు చల్లుతారు. ఈ పౌడర్ నుంచి ఎసీటెలిన్ గ్యాస్ ద్వారా పండ్లు సరిగా పండకపోయినా అందంగా కనిపిస్తాయి. అరటి పండ్లపై ఎథోపాన్ రసాయనాన్ని చల్లుతారు. చెట్టు నుంచి గెలను తీసి స్ప్రే చేయడం లేదా నీటిలో ముంచడం వల్ల అరటికాయ పక్వానికి వస్తుంది. ఆపిల్ పండ్లపై పారాపిన్ అనే మైనాన్ని వినియోగిస్తారు. దీనిని మండించి వచ్చే ఆవిరిని ఆపిల్ పండ్లకు పడుతారు. దీని వల్ల పండ్లలోని నీటి శాతం ఉండిపోతుంది.



● వీటివల్ల జరిగే నష్టాలు..

రసాయనాలు ఉపయోగించి పండ్లను పక్వానికి తేవడం వల్ల మనిషి అవయవాలపై ప్రభావం చూపుతుంది. కడుపులో అల్సర్లు, నాడీ సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులు, చూపు మందగించడం, క్యాన్సర్ వంటివి వస్తాయి. గర్భిణులు తినడం వల్ల గర్భాశయ వ్యాధులు, పిల్లలో జన్యుపరమైన లోపాలు వస్తా యి.

● జాగ్రత్తలు తీసుకోవాలి..

కృత్రిమంగా పండించిన పండ్లు ఎంతో ఆకర్షణీయంగా ఉండి అన్నీ ఒకే రంగులో కనిపిస్తాయి. పండును కోస్తే లోపల సరిగా పండకపోవడం, రుచిగా లేకపోవడం, పండిన వాసన రాకపోవడం మనం గమనించవచ్చు. ముఖ్యంగా వీలైనంతవరకు ప్రతి పండు తొక్క తీసి తినడం మంచిది. ఆపిల్‌కు మైనం పూత ఉన్నట్లు అనుమానం కలిగితే మూడు నిముషాలు వెనిగర్ సొల్యూషన్‌లో ఉంచాలి. నీటితో శుభ్రం చేయాలి. ద్రాక్ష, బొప్పాయి పండ్లను ఉప్పు నీటితో కడిగి తినాలి. మామిడి పండును వేగంగా ప్రవహించే నీటిలో మూడు నిముషాలు ఉంచి తినాలి.

● వేడి, నీరసాన్ని తగ్గించే ద్రాక్ష..



పండ్లలో ద్రాక్ష పండ్లు ఎంతో ముఖ్యమైనవి. ఇందులో విటమిన్లు, కాల్షియం, సోడియం, పొటాషియంతోపాటు నీరు 88.5శాతం, పాస్పరస్ 0.02, పిండి పదార్థాలు 10.2, ఇనుము 0.4, మాంసకృతులు 0.6, విటామిన్ ఎ 151ఐయు, విటామిన్ బి2 10.3, కాల్షియం 0.03, విటామిన్ సి 10మీల్లీగ్రాములు ఉంటాయి. ద్రాక్ష మలబద్దకాన్ని, పైల్స్‌ను నివారిస్తుంది. కాలేయం చురుకుదానాన్ని పెంచుతుంది. మూత్ర సంబంధ బాధలను తగ్గిస్తుంది. రక్తశుద్ధితోపాటు వేడి నీరసాన్ని తగ్గిస్తుంది. క్యాన్సర్ నివారణకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గడానికి కూడా దోహదపడుతుంది.

● సాటిలేని ఆపిల్..



ఆపిల్ పండు వగరు, తియ్యగా, పుల్లగా ఉంటుంది. పండులో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. నీరు 85.4శాతం, కాల్షియం 0.01, పిడి పదార్థాలు 9.5, పాస్పరస్ 0.2, మాంస కృతులు 0.4, ఇనుము 1.7, విటామిన్ ఎ 40ఐయు ఉంటుంది. ఆపిల్‌లో ఉండే ఇనుము, భాస్వరం మెదడుకు, శారీరానికి బలాన్ని ఇస్తుంది. పెక్టివ్ సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. శరీరం నీరసంగా మారితే ఆపిల్ రసం వెంటనే బలాన్ని ఇస్తుంది. ఆలోచన శక్తిని పెంచుతుంది. మెదడుకు ఎంతో ఉపయోగ పడుతుంది. పొట్టలో గ్యాస్, గౌట్, అర్థ్రైటిస్ వ్యాధులకు ఎంతో మంచిది.

● పండ్లలో రాజు మామిడి..



పండ్లలో మామిడి రాజు వంటిది. బాగా పండిన మామిడిలో పిండి పదార్థాలు 12 గ్రామాలు, కాల్షియం మి.17, మాంసం కృతులు 0.6, పాస్పరస్ 20, కొవ్వు పదార్థాలు 0.1, ఇనుము 0.8, విటామిన్ ఎ 4,800 నుంచి 22,550ఐయు, పోటాషియం 250, విటామిన్ బి1 42,755, సోడియం 7, విటామిన్ బి2 50, నియాసిన్ 0.3, విటామిన్ సి 150గ్రాములు ఉంటాయి. వీటితోపాటు సిట్రిక్ యాసిడ్, గాలక్టోజ్‌పాంటోజ్ పిప్పి పదార్థాలు ఉంటాయి. దీని వల్ల మలబద్ధకం నివారణతోపాటు కాలేయం, పేగులు, చురుకుదనంగా పనిచేస్తాయి. మామిడికాయ పచ్చళ్లు ఎంతో ఉపయోగపడుతాయి.

● రక్తహీనతకు దానిమ్మ..



దానిమ్మ పండు రెండు రెకాలుగా ఉంటుంది. తియ్యటివి, పుల్లటివి. ఈ పండు తేలిగ్గా జీర్ణమవుతుంది. పండులో నీరు 78శాతం విటమిన్ సి 16ఎంజి, పిండి పదార్థాలు 14.5, కాల్షియం 0.01, మాంస కృతులు 1.7, పాస్పరస్ 0.7, ఇనుము 0.03 ఎంజి, విటామిన్ బి 10ఎంజి ఉంటుంది. గుండెపోటును, మల బద్ధకాన్ని నివారిస్తుంది. రక్తహీనతకు ఉపయోగపడుతుంది. జ్వరం వస్తే దానిమ్మ పండు ఎంతో ఉపయోగపడుతుంది.

● దాహార్తిని తీర్చే వాటర్‌మిలన్..



వేసవి రాగానే ఎక్కడ చూసిన కనిపించేది వాటర్ మిలన్(పుచ్చకాయ). ఎక్కువగా నీటితో ఉండే వాటర్ మిలన్ వేసవి దాహాన్ని తీర్చుతుంది. నీరు అధిక శాతం ఉండడంతో పాటు కాల్షియం, ఇనుము, సల్ఫర్, కాపర్‌లు ఎక్కువగా ఉంటాయి. రక్తహీనతను తగ్గించడంతో పాటు మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. కడుపులో మంటను, మూత్ర సంబంధ వ్యాధులకు మంచిది.

● గ్యాస్‌ను దూరం చేసే పైనాపిల్..



పొట్టలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను దూరం చేయడంతోపాటు గుండె బలాన్ని పెంచేలా, మూత్రం సాఫీగా ఉండేలా పైనాపిల్ చూస్తుంది. పేగుల్లోని క్రీములను నాశనం చేస్తుంది. పైనాపిల్‌లో నీరు 86.5శాతం ఉంటే విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి, చక్కర, ఇనుము, మాంస కృతులు ఉంటాయి.

● వేడి తగ్గించే తర్బూజా..



వేసవిలో చల్లదాన్ని తర్బూజ అందిస్తుంది. వేసవిలో మాత్రమే ఎక్కువగా దొరికే అందరికి అందుబాటులో ఉంటుంది. తర్బూజాలో నీరు 95.9శాతం ఉంటే కాల్షియం, పిండి పదార్థాలు, పాస్పరస్, మాంస కృతులు, ఇనుము, సోడియంలు ఉంటాయి. ఒంట్లో వేడిని తీసి వేయడంతోపాటు మూత్ర సంబంధ వ్యాదులను తగ్గిస్తుంది. చర్మ వ్యాధుల నివారణకు ఉపయోగ పడుతుంది.

● అజీర్తిని తగ్గించే బత్తాయి..



వేసవిలో అజీర్తికి బత్తాయి ఎంతో ఉపయోగ పడుతుంది. వీటిలో విటామిన్ సి, ఇనుము, పోటాషియం, కాల్షియం, పాస్పరస్‌లు పొట్ట బాగాలను నివారిస్తుంది. ఆకలిని వృద్ధి చేస్తుంది.

● వేసవి దాహానికి కొబ్బరి బొండం..



వేసవి వేడిని తగ్గించడానికి కొబ్బరి బోండం ఎంతో ఉపయోగపడుతుంది. వేసవిలో ఎక్కువగా దొరికే కొబ్బరి బొండాలు చక్కర శాతం ఎక్కువగా ఉండడం వల్ల శరీరానికి శక్తినిస్తుంది. పిల్లలకు కూడా కొబ్బరి బొండాలు వేసవిలో ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతో దోహద పడుతుంది.

● ఉష్ణోగ్రతను నియంత్రించే సపోటా..



శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగకుండా సపోట పండ్లు నియంత్రిస్తుంది. సపోటలో ఉండే కరోటిన్ కంటికి రక్షణగా నిలుస్తుంది. గ్లూకోజ్, విటామిన్ సి, కాల్షియం, క్లోరిన్, పీచు పదార్థాలు అధికంగా ఉండే సపోటాతో నీరసం తొలగించి శక్తి నిస్తుంది.


కొండంతా.. కాషాయమయం

- హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు షురూ
- కొండగట్టుకు తరలివస్తున్న దీక్షాపరులు
- నేడు చిన్న హనుమాన్ జయంతి



కొండగట్టుకు వస్తున్న హనుమాన్ దీక్షాపరులు

మల్యాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుని మాలవిరమణ చేస్తున్నారు. వేకువజామున వేలాదిగా భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. జయంతి కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలి నడకన కొండగట్టుకు తరలి వస్తున్నారు. కాగ శనివారం చిన్న



కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

జయంతి కోసం శుక్రవారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా భక్తులు, దీక్షపరులు కొండకు తరలివస్తున్నారు. దీంతో కొండంతా కాషాయయంగా మారింది. కలెక్టర్ సత్యప్రసాద్ కొండపై అధికారులతో కలసి ఏర్పాట్లు, సౌకర్యాలు పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి, శ్రీనివాసరావు, ఈవో శ్రీకాంత్‌రావు, డిఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి తదితరులు నిరంతరం కొండపైన పర్యవేక్షిస్తున్నారు.

నేడు హనుమాన్ చిన్న జయంతి

ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతిని దేవస్థానం తరుపున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తర భారతదేశంలో ప్రతియేటా చైత్ర పౌర్ణమి రోజున హనుమాన్ జయంతిని నిర్వహించనుండగా ఇక్కడ కూడా అదే రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కాగా జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్రలంకరణ అలంకారం చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా సాయంకాలం ఆలయ ఆవరణలో భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● తండోపతండాలుగా భక్తులు

వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తుండడంతో కొండంతా కాషాయమయంగా మారింది. రామనామంతో అంజన్న సన్నిధి పులకిస్తోంది. అంజన్న దీక్షాపరులు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి సన్నిధిలో మాల విరమణ చేయడం ఆనవాయితీ. దీంతో మాల విరమణ కోసం కల్యాణకట్టలో దీక్షావిరమణ మండపం ఏర్పాటు చేశారు. ఇందులోనే భక్తులు మాల విరమణ చేస్తున్నారు. కొండగట్టుకు వస్తున్న భక్తుల వాహనాలకు జెఎన్‌టీయూ మార్గంలోని బొజ్జ పోతన వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఆలయంకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసింది. కాగా కొండపైన ఉత్సవాల కోసం వచ్చిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సంఖ్యే అధికంగా కనిపిస్తుంది.



కొండగట్టులో కల్యాణ కట్ట వద్ద భక్తుల రద్దీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

వైభవంగా ప్రారంభమైన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు



వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేరులో వెలసిన భూ,నీళాసమేత రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామి వారిని శేషవాహనం పై ఊరేగించారు. మంగళవాయిద్యాలు భక్త జనసందోహం మధ్యన భక్తిగీతాలు ఆలపిస్తుండగా భూనీళా సమేతుడైన రంగనాయకుల శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శేషవాహన సేవలు కొనసాగగా, శనివారం పొన్నసేవ, ఆదివారం గరుడవాహన సేవలు జరగనున్నాయి. సోమవారం డోపుకథ తోపాటు బండ్లు తిరిగే కార్యక్రమం వైభవంగా చేస్తారు. చుట్టు పక్క గ్రామాల రైతులు ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ తిరుగుతారు. మంగళవారం హంస వాహన సేవ, తెప్పోత్సవం, రాత్రి డోలోత్సవం ఉంటుంది. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా రథోత్సవం ఈనెల 17న తెల్లవారుజామున ప్రారంభమువుతుంది.

రథోత్సవానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు గోవర్ధన గిరి మనోహరాచార్యులు, ఆచార్య రాజ్‌కుమార్ తెలిపారు.

ఎస్‌యూ పీహెచ్‌డీ ప్రవేశఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్ జాస్తి పీహెచ్డీ ప్రవేశ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమేష్ కుమార్ మాట్లాడుతూ నాలుగు ప్యాకల్టీ విభాగాల్లో ఫలితాలను విడుదల చేశామని, విశ్వవిద్యాలయంలో పరిశోధన మరింత ముందుకెళ్తుందని అన్నారు. ఇది విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, సోషల్ సైన్స్‌డీన్ ఆచార్య సుజాత, ఓఎస్డీటు వీసీ హరికాంత్, అదనపుపరీక్షల నియంత్రణ అధికారి అబ్రారూల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం

వెల్గటూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం సూరారం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్, ఆర్ఐ రాజేశ్వరి తెలిపారు. సూరారంలో అక్రమ ఇసుక నిల్వ చేశారనే సమాచారం మేరకు వెల్గటూర్ పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 8నుంచి 10ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ చేశారని నిర్ధారణ కావడంతో ఇసుకను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దుష్ప్రచారాన్ని నిలిపివేయాలి..

- నేరెళ్ల ఘటనపై ఎస్సీ కమిషన్‌ను తప్పు పడుతారా?
- చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో 2017లో ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతిచెందగా, ఆసంఘటనలో దళితులు, ఇతరులపై జరిగిన వేధింపులపై ఎస్సీ కమిషన్ విచారణ జరిపింది. ఇటీవల కొంతమంది నేరెళ్ల ఘటనలో సోషల్ మీడియా వేదికగా జాతీయ ఎస్సీ కమిషన్‌ను బద్నాం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామచందర్ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. దళితుల పక్షాన పనిచేసే కమిషన్‌ను నిందించడాన్ని ఆయన తప్పు బట్టారు. తక్షణమే దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని కోరారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరేళ్ల ఘటనలో ఎస్సీ కమిషన్ జరిపిన విచారణతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశామని, బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

2017 జూలైలో రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామంలో ఎస్సీ కమిషన్ పర్యటించి బహిరంగ విచారణ జరిపింది. ఆ విచారణలో భాగంగా ఎస్సీ కమిషన్ కరీంనగర్ జైలుకు వెళ్లి నేరేళ్ల బాధితులను కలిసి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. కలెక్టర్, పోలీస్ అధికారులను విచారణ జరిపి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. అదే సంవత్సరం ఆగస్టు 7న అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మధ్యంతర నివేదికను పంపిస్తూ చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించింది.

బలహీనవర్గాల ఆరాధ్య దైవం జ్యోతిబా పూలే




నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

కరీంనగర్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బలహీనవర్గాల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిబా పూలే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా నగరంలోని పూలే విగ్రహం వద్ద మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయంటే దానికి కారణం పూలే చూపిన మార్గమేనని కొనియాడారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జడ్పీ మాజీ చైర్ పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: శాతవాహన విశ్వవిద్యాలయం సమీపంలో జ్యోతీబాపూలే విగ్రహం వద్ద తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

కరీంనగర్ అర్బన్: డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం నగర కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద పూలే విగ్రహానికి మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, ఇతర ముఖ్య నేతలు నివాళులు అర్పించారు.

కరీంనగర్ అర్బన్: యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీం ఎస్‌యూ పూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు.

గణేశ్‌నగర్: శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన ర్యాలీని వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ప్రారంభించారు.

జ్యోతిబా పూలే మైదానంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలోనూ బీసీ యువజన సంఘం ఎన్నం ప్రకాష్ ఆధ్వర్యంలోనూ నివాళి అర్పించారు. ఎస్ఎఫ్ఐ నగర్ కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ పూలే విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఇషాక్ నివాళులు అర్పించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ బొల్లం లింగమూర్తి ఆధ్వర్యంలో, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్సీ రమేష్ బాబు నివాళులు అర్పించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులంలో ప్రిన్సిపాల్ మాలతి పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

భగత్‌నగర్: కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి రీజినల్ మేనేజర్ రాజు పూల మాల వేసి నివాళులు అర్పించారు.

- మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.
- బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.
- డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాంనగర్‌లో నివాళులర్పించారు.
- బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.



నివాళులు అర్పించిన బీజేపీ నాయకుల

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/శంకరపట్నం/మానకొండూర్/గంగాధర/చిగురుమామిడి/జమ్మికుంట/చొప్పదండి/సైదాపూర్: మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం మహాత్మాజ్యోతిబాపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు బలహీనవర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొని యాడారు. ఆర్నకొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌యూ విద్యార్థులతో వీసీ ఉమేష్‌కుమార్



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

మహిళల సమస్యలకు శుక్రవారం సభ పరిష్కార వేదిక

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలకు శుక్రవారం సభ పరిష్కార వేదికగా నిలుస్తుందని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ మండలం జూబ్లీనగర్ అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం సభ నిర్వహించారు. మహిళలు సమస్యలను శుక్రవారం సభలో విన్నవించుకోవాలన్నారు. జిల్లా వైద్య అధికారి వెంకట రమణ, ఎంపీడీవో సంజీవరావు, డీఐవో సీజదా, ఈవో రవీందర్ పాల్గొన్నారు.

రేపు లైవ్ మెలోడియస్ నైట్ విత్ స్టార్ వాయిసెస్

కరీంనగర్ కల్చరల్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, మెలోడి లవర్స్ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కళాభారతిలో ఈద్ మిలాప్ సెలబరేషన్ పేరిట లైవ్ మెలోడియస్ నైట్ విత్ స్టార్ వాయిసెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సల్వాజి ప్రవీణ్, మహ్మద్ ముఫ్తీనొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి సెషన్ సాయంత్రం 4 గంటలకు, రెండవ సెషన్ 6 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తొలి సెషన్‌లో కరోకే మీదుగా పాడాలకునే కళాకారులు 8340985097 నెంబరుకు ఫోన్ చేసి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

చెర్లబూత్కూర్‌లో 'గావ్ చలో అభియాన్'

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్‌లో శుక్రవారం గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్రం న ఉఉంచి 80శాతం వస్తున్నట్లు తెలిపారు. ఎరువులలోనూ సబ్సిడీ ఇస్తూ రైతులకు భారం కాకుండా చూస్తున్నట్లు చెప్పారు. గ్రామ అధ్యక్షుడు దాసరి రమణరెడ్డి పాల్గొన్నారు.

భగత్‌నగర్: బీజేపీ ఆవిర్భా దినోత్సవం సందర్భంగా 17వ డివిజన్‌లో బీజేపీ నాయకులు బస్తీ చలో కార్యక్రమం చేపట్టారు. బీజేపీ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, పెద్దపల్లి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టగొడుతున్న రాజస్థాన్ హోల్‌సేల్ వ్యాపారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి వలస వచ్చిన హోల్ సేల్ వ్యాపారులు చిరువ్యాపారుల పొట్టగొడుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. శుక్రవారం నగరంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో మొబైల్ టెక్నిషియన్‌అసోసియేషన్ చిరు వ్యాపారులతో కలిసి నిరసన తెలిపారు.

కృష్ణయ్యను కలిసిన నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను జిల్లా నాయకులు శుక్రవారం పెద్దపల్లిలో కలిశారు. అ సందర్భంగా ఆయనను సన్మానించారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మనోజ్ గౌడ్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని 26వ డివిజన్ కాంగ్రెస్ బాధ్యుడు, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు డివిజన్‌కు చెందిన సుంచు మల్లయ్యతోపాటు చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన లంక శ్యామలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి అంజన్‌కుమార్ శనివారం చెక్‌లను అందజేశారు.

ఆదివాసీలపై దాడులు నిలిపివేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులు నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల సంఘీభావపోరాట వేదిక కన్వీనర్ ముడిమడుగుల మలలన్న అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో ఈ నెల 20 నిర్వహించతలపెట్టిన బహిరంగ సభ పోస్టర్‌ను అవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘాలను అణచివేసే ధోరణి సరికాదు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘాలను అణచివేసే ధోరణి సరికాదని ఆనిచివేసే దోరని సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంత్యు త్సవాల్లో సరైన గౌరవం ఇవ్వకుండా అవమాన పరిచారని శుక్రవారం నగరంలోని సభావేదిక ఎదుట ఆందోళన చేపట్టారు. జయంత్యుత్సవాల్లో బీసీ సంఘాలను అవమాన పరిచారని, బీసీ సంక్షేమ శాఖ ఆధికారిని సస్పెండ్ చేయలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కరీంనగర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగరాజు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):కరీంనగర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లింగంపల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా చందా రమేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు ప్రకటించారు. న్యాయవాదుల హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ లక్ష్మారెడ్డి, పరమేశ్వర్ ఎన్నికైనవారిని సన్మానించార

నేడు మద్యం, కల్లు దుకాణాల మూసివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మద్యం, కల్లుదుకాణాలను మూసి వేయాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాలు జారీ చేశారు. కల్లు డిపో, మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, మద్యం డిపో, క్లబ్‌లు మూసివేయాలని పేర్కొన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శనివారం మధ్యా హ్నం 2 గంటల నుంచి రాత్రి 10 మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అంతర్జాతీయ చదరంగం పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు కంఠీరవ ఇండోర్ స్టేడియంలో కర్ణాటక చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 వరకు నిర్వహిం చనున్న నమ్మ బెంగుళూరు ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్స్ బీ కేటగిరి ఫీడే రేటింగ్ చదరంగ పోటీలకు నగరంలోని విశ్వనాథ్ చెస్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. అకాడమీ కోచ్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్, విద్యార్థులు చిట్టుమల్ల కశ్యప్, బాలసంకుల అమన్‌రామ్, డి అక్షిత్, ఈగ లిఖిత్ చైతన్య, బత్తిని శ్రీహన్, గంట అభయ్‌రామ్, కనుకుంట్ల అకీరా, ఈగ శివచైతన్య పాల్గొననున్నారు.

మానేరు రివర్ ఫ్రంట్ పూర్తి చేయండి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అన్ని అనుమతులతో ప్రారంభించిన మానేరు రివర్ ఫ్రంట్ పనులను జూన్‌లో పూర్తి చేసే బాధ్యతను జిల్లా మంత్రులు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మీడియా సమా వేశంలో మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ మూసీ నదిని సబర్మతి రివర్ ఫ్రంట్ తరహా అభివృద్ధి చేస్తామని చెప్పడం శోచనీయమన్నారు. ప్రారంభోత్సవం, స్థల సేకరణ, పర్యావరణ అనుమతులను తీసుకోకుండా మూసీనదిని అభివృద్ధి చేస్తామనడం ఆయనకే చెందిందన్నారు. కరీంనగర్‌లో అన్ని అనుమతులతో 542 కోట్లతో ప్రారంభించిన మానేరు రివర్ ఫ్రంట్‌కు టూరిజం శాఖ ద్వారా 100 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినందున మూసీ కంటే ముందు ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిలిపివేసినట్టు, కరీంనగర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలను అడ్డుకున్నట్లు, మానేరు రివర్‌ఫ్రంట్‌నుకూడా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయ్యిందని, ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు.

జిల్లా కార్యాలయం కార్యకలాపాలు

ఇకపై బీఆర్‌ఎస్ కార్యక్రమాలతోపాటుగా ప్రెస్‌మీట్లు, సమావేశాలన్నీ చింతకుంట సమీపంలో నిర్మించిన ఆ పార్టీ కార్యాలయంలోనే నిర్వహిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు కరీంనగర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ సిల్వర్‌జూబ్లీ వేడుకలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు.

- భగత్‌నగర్: కొత్తపల్లి మండలం చింతకుంటలోని బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఉమ, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, మాజీ గ్రంథాలయ చైర్మన్‌లు అనిల్ కుమార్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, నగర అధ్యక్షుడు హరిశంకర్ పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సేవలను వినియోగంలోకి తేవాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సిగ్నల్ సిస్టమ్, సీసీ సర్వెలెన్స్ కెమెరా, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఎన్విరాన్‌మెంటల్ సెన్సార్స్, ఫ్రీ వైఫై, సాలీడ్ వేస్ట్ మేనేజిమెంట్, చాలన్ జనరేట్ తదితర ప్రాజెక్టుల పనితీరుపై పలు సలహాలు, సూచనలు చేశారు. పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని కోరారు.

నగరంలో దారి మళ్లింపు చర్యలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో శనివారం నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్ర సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ప్రకటనలో తెలిపారు. నగరంలోని గాంధీ రోడ్డు, వైశ్య భవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, కమాన్ రోడ్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా, బస్టాండ్, తెలంగాణ చౌక్, ఐబీ చౌరస్తా, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ విగ్రహం నుంచి తిరిగి వైశ్య భవన్ వద్ద శోభయాత్ర ముగియనున్నదని తెలిపారు. యాత్ర జరిగే సమయంలో ఆయా మార్గాల్లో వాహనాలను అనుమతించబోమని పేర్కొన్నారు. హైదరాబాద్, వరంగల్ వైపు నుంచి నగరంలోకి వచ్చే బస్సులు సిరిసిల్ల బైపాస్ నుంచి కట్టరాంపూర్ మీదుగా అంబే ధ్కర్ స్టేడియం, కలెక్టరేట్ రోడ్, ప్రతిమ మల్టీప్లెక్స్ నుంచి బస్టాండ్‌కు, ఇదే మార్గంలో వచ్చే కార్లు, మోటారు సైకిళ్లు, ఇతర చిన్న వాహ నాలను మైసూర్ బేకరీ నుంచి గణేష్ నగర్ మీదుగా అంబేద్కర్ స్టేడి యం, కలెక్టరేట్ రోడ్, ప్రతిమ మల్టీప్లెక్స్ నుంచి నగరంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్/శంకరపట్నం/రామడుగు/మానకొండూర్/తిమ్మాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నేడు పలు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయామండలాల విద్యుత్‌శాఖ అధికారులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. హుజూరాబాద్ పట్టణంతోపాటు, బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో ఉదయం 8:30నుంచి 10:30 గంటల వరకు, శంకరపట్నం మండలంలోని మొలంగూర్, ఆముదాలపల్లి సబ్‌స్టేషన్లపరిధిలో ఉదయం 9నుంచి 10:30గంటల వరకు, రామడుగు మండలంలోని గుండి, షానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8నుంచి 10గంటల వరకు, మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం9నుంచి11వరకు, కరీంనగర్‌కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ఉదయం 10నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు, విద్యుత్ లైన్‌ల వెంబడి చెట్లకొమ్మల నరికివేత తదితర పనుల దృష్ట్యా విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

రాగంపేట రైతులను తక్షణమే ఆదుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

చొప్పదండి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాగంపేట రైతులను తక్షణమే ఆదుకోవాలని బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రాగంపేట గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లంపల్లి పైప్‌లైన్ గేట్‌వాల్ చెడిపోయి నీటిసరఫరా జరగడం లేదని రాగంపేట గ్రామ రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం అన్యాయమని అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్‌ను రద్దుచేయాలి

గంగాధర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్ రద్దు చేయాలని డాక్యుమెంటు రైటర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంటు రైటర్లు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధానంతో డాక్యుమెంటు రైటర్లకు జీవనోపాధి కరువై వారి కుటుంబాలు వీధిన పడనున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్లాట్‌బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం రద్దు పరచాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు జననీరాజనం

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని సుడాచైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉస్మాన్‌చౌరస్తా నుంచి కలెక్టరేట్‌రోడ్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్, రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ మండలం తహెర్ కొండాపూర్, చెర్లబూత్కూర్, దుబ్బపల్లిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు.

బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో..

హుజూరాబాద్/గంగాధర/ఇల్లందకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు మండలాల్లోని పలువీధుల్లో గావ్‌చలో.. బస్తీచలో.. కార్యక్రమాన్నినిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీపట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో పలు దేవాలయాల్లో స్వచ్ఛతకార్యక్రమం, చెరువుల శుద్ధీకరణ పనులు చేశారు. గంగాధరలో బీజేపీ దళితమోర్చా జిల్లాఅధి కార ప్రతినిధిఆధ్వర్యంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న తుమ్మచెట్లను తొలగించారు.

అభివృద్ధిలో అల్గునూర్‌ను అగ్రగామిగా నిలుపుతాం: ఎమ్మెల్యే



అల్గునూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి

తిమ్మాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అల్గునూర్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అల్గునూర్‌లో 105లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక ముందు అల్గునూర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గం నిధులతోనే కాకుండా కార్పొరేషన్ నిధులతో ఇక్కడ చేపట్టే పనులతో అల్గునూర్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపాల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, నాయకులు గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'కు తోడ్పాటునందించాలి..

ఎమ్మెల్యే ఆన్‌వీల్స్ కార్యక్రమానికి ఆధికారులు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఈనెలలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే ఆన్‌వీల్స్ కార్యక్రమం అమలుపై నియోజకవర్గంలోని అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయడానికి ప్రత్యేకయాప్‌ను రూపొందించామని తెలిపారు. ఈయాప్ ద్వారా ప్రజలనుంచి వచ్చే విన్నపాలను పరిష్కరించేందుకు రోజుకు మూడు గ్రామాలకు ప్రత్యేకంగా తయారు చేయించిన వాహనంలో అధికారులతో కలిసి వెళతానని అన్నారు. ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆయన అధికారులను కోరారు. డిప్యూటీఇంజనీర్లు రవిప్రకాశ్, మంజుల భార్గవి, తహసీల్దార్లు విజయ్‌కుమార్, కె వరలక్ష్మి, బత్తుల భాస్కర్, ఎంపిడివోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

మానకొండూర్: మానకొండూర్‌లోని రైతువేదికలో శుక్రవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెక్కులను పంపిణీ చేశారు. భవిష్యత్తులో ఎవ్వరికి ఆపద వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసమే పాదయాత్ర



జై భీం యాత్రలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసమే జై బాపు, జై భీమ్, సంవిధాన్ యాత్ర చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో పాదయాత్ర చేపట్టారు. కేంద్రంలో అధికారంలోఉన్న బీజేపీ పాలనతో రాజ్యాంగ పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్ద పీటవేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత, సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రూ.7650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7650 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 12మంది రైతులు 193క్వింటాళ్ల విడిపత్తి, ఆరుగురు రైతులు 13క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7650, కనిష్ఠ ధర రూ.5800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్ యార్డుకు శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సెలవు అని, తిరిగి మంగళవారం యార్డులో కొనుగోళ్ల ప్రారంభం అవుతాయని తెలిపారు.

వక్ఫ్‌బోర్డును రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం



మానకొండూర్‌లో ఆందోళన చేస్తున్న ముస్లింలు

మానకొండూర్/హుజూరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో వక్ఫ్ బోర్డును రద్దుచేయడం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం జేఏసీ మానకొండూర్ మండల అధ్యక్షుడు సయ్యద్ హమీద్‌అలీ అన్నారు. మానకొండూర్‌లోని మజీద్ ముందు శుక్రవారం ముస్లింలు ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హమీద్‌అలీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ముస్లింల హక్కులను కాలరాస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డును రద్దు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాపంగా ఆందోళనలను చేపడతామని అన్నారు. హుజూరాబాద్‌లో డివిజన్ మజీద్ ఈద్గా కబ్రిస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు బిల్లును ప్రవేశపెట్టి ముస్లింలను ఇబ్బందులు గురిచేయడం సరికాదన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యతిపతి అరుణ్

హుజూరాబాద్ లీగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా యతిపతి అరుణ్ శుక్రవారం ఎన్నికయ్యారు. అధ్యక్షపదవికి జరిగిన పోటీలో యతిపతి అరుణ్‌కుమార్‌కు 59ఓట్లు రాగా, బండి కళాధర్‌కు 53ఓట్లు పోలయ్యాయి. ప్రధానకార్యదర్శిగా ఎర్రోళ్ల రమేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నూతల శ్రీనివాస్, సహాయకార్యదర్శిగా పిట్టల రాజేష్, లైబ్రరీ కార్యదర్శిగా భానుకిరణ్, కోశాధికారిగా బాగోతం కుమారస్వామి, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రెటరీగా ఇరుమండ్ల జయపాల్, సీనియర్ ఈసీ మెంబర్‌గా బండి రవీందర్, జూనియర్ ఈసీ మెంబర్‌గా తునికి రవి, లేడీ ఈసీ మెంబర్‌గా శిరీషలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అడ్‌హక్ కమిటీ సభ్యులు నల్ల భూమి రెడ్డి, కంకణాల అమరేందర్‌రెడ్డి, సికె జేమ్స్, నక్క సత్యనారాయణ తెలిపారు.

అవీ.. ఇవీ..

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో ఆదివారం సంజీవిని నర్సింగ్ హోమ్ డాక్టర్ విజయలక్ష్మి నవీన్‌కుమార్ ఉచితమెగాశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రివర్గాలు ఒకప్రకటనలో తెలిపాయి.

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంటలో శుక్రవారంసభ నిర్వహించారు. మహిళలు, గర్భిణులకు, బాలింతలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకవిలువలున్న ఆహార పదార్థాలు, ప్రాముఖ్యతపై వివరించారు.

సైదాపూర్: మండలంలోని ఎలబోతారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మంజుల గర్భిణులు సరైనా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

చొప్పదండి: అగ్నిప్రమాదాల నివారణపై చొప్పదండిలో శుక్రవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

గంగాధర: గంగాధర అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప జన్మనక్షత్ర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశేష ద్రవ్యములతో అభిషేకం, అలంకరణ, కర్పూరనీరాజం నిర్వహించారు.

రామడుగు: మండలంలోని రుద్రారం గ్రామానికిచెందిన జర్నలిస్టు రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకుడు చిలుముల మహేందర్ తల్లి లక్ష్మీ అనారోగ్యంతో మృతిచెందగా వారిని మాజీమంత్రి కొప్పులఈశ్వర్, మాజీఎమ్మెల్యే సుంకెరవిశంకర్ పరామర్శించారు.

-గోపాల్‌రావుపేటలో సన్నబియ్యం పథకంలో భాగంగా లబ్ధిదారు పొన్నంపుష్పలత ఇంట్లో జిల్లామహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు కర్రసత్యప్రసన్న భోజనం చేశారు.

-రామడుగు రైతువేదికలో ఏడీఏ ప్రియదర్శిని వానాకాలంలో విత్తన, ఎరువుల, క్రిమిసంహారక మందుల క్రయవిక్రయాలలో పాటించాల్సిన జాగ్రత్తలపై డీలర్లతో సమావేశం నిర్వహించారు.

హుజూరాబాద్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 607 మందిలబ్ధిదారులకు రూ.6,77,0412 విలువగల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి పంపిణీ చేశారు.

-పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ, సేవాభారతి ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు.

హుజూరాబాద్‌రూరల్: చిన్నపాపయపల్లి ప్రత్యేకాధిరి మహమ్మద్ రషీద్‌కు కరీంనగర్ జిల్లా పట్టుపరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈమేరకు శుక్రవారం ఆయనను గ్రామపంచాయతీ సిబ్బంది సత్కరించారు.